




## ఒక లీలావతి

**ఉమ్మెత్తల లీలావతి / హైదరాబాద్**


ఇంట్లో లీలావతి

*గొప్ప పనులు చేయడానికి గొప్ప వారే ముందుకు రావాలనుకుంటే పొరబాటని నిరూపిస్తున్న బామ్మ, ఈ లీలావతి.*

**హైదరాబాద్‌లోని** కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ మూడో ఫేజ్‌లోని చౌరస్తా. అక్కడకు ఉదయాన్నే వెళితే - ఆరు, ఆరున్నర నుంచీ ఎనిమిది వరకూ ఓ ముసలావిడ, రోడ్డు పక్క కూర్చుని పాడుతూ ఉంటుంది.

అంత ఉదయాన్నే జనం అలికిడి తక్కువే - అయినా వారికోసం ఆమె పాడుతుంది.

అప్పుడే తెరిచిన టిఫెన్ సెంటర్లు మటన్ సెంటర్లు, పాన్‌షాపులు, వాటి యజమానులు - కష్టమర్లు ఒక్కొక్కరు కదులుతుంటే ఆమె వారిని నెమ్మదిగా కదిలిస్తుంది.

ఉదయాన్నే వేడి వేడిగా టీ తాగి పనుల్లోకి దిగేవాళ్ళు, ఉదయాన్నే బస్సుకోసం వేచి ఉండే కాలనీ వాసులు, రివ్వున దూసుకెళ్ళే పేపర్ బాయ్‌లు, సైకిళ్ళు, ఆటోలు, బస్సులు - అన్నీ ఆమె ఆలాపన తాలూకు ఆధ్యాత్మికతను ఇముడ్చుకుని దైనందిన జీవితంలోకి నిదానంగా కాలిడతాయి. జాగ్రత్తగా గమనిస్తే, అపుడే నిద్ర లేచిన లౌకిక ప్రపంచం నుదుట కాసింత ఆధ్యాత్మిక తిలకాన్ని దిద్ది, ఇక నీ దారిన పో... అని చెప్పే జగన్మాతవలే ఆమె గోచరిస్తుంది.

సరిగ్గా ఆరింటికే మీరెళితే, చౌరస్తా మధ్యన నిలబడండి.

దూరంగా ఒకామె గునగునా నడిచి వస్తుంది.

ఆమే లీలావతి.

బొద్దుగా, పొట్టిగా ఉండే ఆవిడ వయోభారాన్ని కూడా లెక్కచేయకుండా రెండు ఫర్లాంగుల దూరంలో ఉండే ఇంటి నుంచీ నడిచి వస్తుంటే కొత్తవారికి తమాషాగా కనిపిస్తుంది.




కానీ సుమారు ఐదేళ్ళుగా ఆమె పాటకు అలవాటు పడిన అక్కడి జనానికి మాత్రం ఆమె తమాషా కాదు. ఒక చోటుకు వచ్చి ఆమె కూర్చుని పాడే పాటే వారికి గుర్తొస్తుంది.

ఆమె కూచునే చౌరస్తాలో నలువైపులా టీ హోటళ్ళున్నాయి.

అక్కడ చేరిన వారికి ఆమె వినిపిస్తుంది. అంతే.

ఎందుకంటే. ఆమె ఫలానా చోటే కూచుంటుందనేమీ లేదు. ఆ దరిదాపుల్లో ఎక్కడైనా కూచుంటుంది. ఆమె కూర్చున్న చోటుకే ఎవరో ఒకరు మంచినీళ్ళు తెచ్చి ఇస్తారు. పాడుతుండగా మధ్యలో ఒకరు టీ అందిస్తారు. ఇలా ఆమెకంటూ వ్యక్తం కాని ఫాలోయింగ్ ఒకటుందంటే ముచ్చటగా ఉంటుంది.

ఆమె ఒక మహిళ అయిఉండీ, వయసు మీద పడి కూడా, ఎవరేమి అనుకుంటారనే ఆలోచనేమీ లేకుండా, ఓ ఓపెన్ థియేటర్‌కు హాజరై లక్షలాది జనవాహిని కోసం పాడే ప్రముఖ సింగర్ వలే చకచకా కదలడం వారిని ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

ఎవరో పిలిచినట్టు వచ్చి, ఆ వీధిలో ఎక్కడ అనువుగా ఉంటే అక్కడ కూర్చుని ఆమె పాడటానికి ఉద్యుక్తమయ్యే తీరును గమనించడానికి కూడా ఒకింత ధైర్యం కావాలేమో?

మనిషిని చూస్తే వాళ్ళ యాక్టివిటీ గుర్తొచ్చి కలిగే ఒక ప్రత్యేక ఫీలింగ్ ఆమె విషయంలోనూ నిజమై వారిలో ఆమె ఒక అనిర్వచనీయమైన అభిమానాన్ని రేకెత్తించడంతో మిగతా చాదస్తాలేమైనా ఉన్నా అవన్నీ పటాపంచలే అవుతాయి.

కొందరికి ఇదంతా పిచ్చిపనిగా అనిపిస్తుండవచ్చు. ముసల్ది రోజూ వచ్చి ఇలా పాడటం ఏమిటని సీరియస్ అయ్యేవారూ ఉన్నారు. కానీ ఐదేళ్ళుగా ప్రతిరోజూ ఆమె దినచర్యను చూసిన వారికి ఆమె అక్షరాలా లీలావతే.

ఆమె వస్తుంది.

కొంచెం అటూ ఇటూగా వస్తుంది.

పసిపాప మోములో కనిపించే నిర్మలమైన నవ్వుతో ఆమె రావడం జనారణ్యంలో రిలీఫ్.

ఆమె రాలేదంటే ఆ రోజు సాయంత్రం ఐదింటికైనా వస్తుంది.

సాయంత్రమూ రాలేదంటే, ఆమె ఆరోగ్యం బాగాలేదన్నమాట.

కానీ మర్నాడు వస్తుంది, అయ్యో నిన్న రాలేదే అని నొచ్చుకుంటూ వస్తుంది.

అన్నట్టు ముప్పయ్యేళ్ళుగా బోదకాలుతో బాధపడుతోంది. కాలు కదిపితే నొప్పి. వయసు కారణంగా కీళ్ళ నొప్పులు.

అయినా వస్తుంది.

కోడలు పుట్టింటికి వెళ్ళినప్పుడు కొడుక్కి వండిపెట్టాక ఏడు, ఏడున్నరకైనా వచ్చి పాడుతుంది.

ఆమెకు వినికిడి లోపం కూడా ఉంది. ఈ మధ్యే వచ్చింది. మీరేదైనా అడిగితే, కాగితం మీద రాసి చూపండి, చెబుతాను అంటుంది.

**మనిషి ఉత్సాహవంతురాలు. వెన్నవలే మెత్తగా ఉన్నా ఉక్కు హృదయం, వయసు ముదిరేదాకా వివేకానందుడే ఉన్నాడనుకుంటే ఈమె వివేకానందిని.**

మీరే మాట్లాడి చూడండి, ఎంత విశ్వాసాన్ని పంచుతుందో వినండి.

చతురైన సంభాషణ.

చారడేసి కళ్ళు. వాటికి దట్టంగా కాటుక.

పెద్ద తిలకం.

గొంతే కాదు, ముఖం కూడా పలుకుతుంది.


టిఫిన్ సెంటర్లో కాసేపు కాలక్షేపం

ఉదయాన్నే వచ్చి ఓ చోట కూచుంటుంది.

ముందు పుస్తకం తెరిచి ప్రార్థన చేస్తుంది.

తర్వాత శ్లోకం.

ఆ తర్వాత ఒకటిగా సర్వ మత గీతాలను ఆలపిస్తుంది.

ఒక్కోసారి కొందరు గుమిగూడి వింటే మరోసారి ఒక్కరూ వినరు. వినరంటే వినరని కాదు, ఎదురు హోటల్లో కేరిలోంచి గ్లాసులోకి ఛాయ్ ఒంపుతూ ఒకాయన వింటూనే ఉంటాడు.

చదువుతూ చదువుతూ పేపరు మడత పెడుతున్న మరో పెద్ద మనిషికి ఇప్పటిదాకా నేపథ్య సంగీతం ఆమెనే.

వింటున్నాను అన్నట్టుగా ఎవరూ ఉండలేకపోయినా అనునిత్యం ఇక్కడివారికి ఆమె ఒక యధాలాపం - సుప్రభాతం.

తన ఉనికి ఓ ప్రత్యేక అటెన్షన్ డిమాండ్ చేయదు అన్నట్టు, ఆమె కూడా తన కోసమే తాను పాడుకుంటున్నట్టు పాడి వెళ్ళిపోతుంది.

సమయం గడిచినకొద్దీ, ఆమెకు ఇంకా పాడాలనే ఉంటుంది. కానీ రోడ్డు, అక్కడి రణగొణ ధ్వనుల వల్ల గొంతు పెంచి పాడే శక్తి లేక ఆమె తప్పుకుంటుంది. అంటే మరేం లేదు, ఎనిమిదికల్లా ఇంటికేసి నడుచుకుంటూ పోతుంది.

వెళుతూ వెళుతూ ఎదురువచ్చే వారి యోగక్షేమాలు కనుక్కుని మరీ వెళుతుంది.

ఆమె వెళ్ళే దారిలో ఎడమవైపు కొత్తగా ఓ టిఫిన్ సెంటర్ వెలిసింది. భార్యాభర్తలు నడుపుకుంటారు. ఓ నిమిషం వారిని పలకరించి, పాపను ముద్దాడి నాలుగుడుగులు వేసి మూల మలుపు తిరిగి వెళుతుంది.

తిరగ్గానే ఓ ఫర్లాంగు అవతల కుడివైపున ఆమె ఉండే క్వార్టర్ ఉంటుంది. అదే ఆమె ఇల్లు.

అక్కడ ఆమెను పలకరిస్తే లోపల మా అబ్బాయి నిద్రపోతున్నాడు, ఏమనుకోకు బాబు, ఈ అరుగు మీద కూచుని మాట్లాడుకుందాం... అంటుంది.

ఆమెకు 63 ఏళ్ళట.

విజయవాడ స్వస్థలం అంది.

ఈ ప్రాంతానికి వచ్చి ఐదేళ్ళయిందట.

అప్పటి నుంచీ పాడుతోందట.

అంతకుముందు సరూర్‌నగర్‌లో ఉండేదట.

అక్కడా ఇంటిముందు ఖాళీస్థలంలోనే పెద్దగా పాడేదట.

భర్త విష్ణుమూర్తి.

మరణించి ఐదేళ్ళయింది.

అతడు పాలకొల్లులోని షుగర్ ఫ్యాక్టరీలో పనిచేసేవాడట.

వీరికి ఇద్దరు కొడుకులూ, ఒక కూతురు.

ఈ క్వార్టర్‌లోనే చిన్న కొడుకు, కోడలితో ఆమె ఉంటుంది.

దినమంతా ఆమెకు బోర్‌గానే ఉంటుందట. ఎపుడెపుడు తెల్లవారుతుందా, తన పాట వినిపించాలా అన్నట్టు ఆమె ఉషస్సు కోసం ఎదురుచూస్తుందట. లేచీలేవగానే హుషారుగా తయారై వచ్చి పాడటానికి ఉపక్రమిస్తుందట.

అడిగిన కొద్దీ ఉత్సాహంగా తన వివరాలు చెబుతోంది.

ఎస్ఎస్ఎల్సీ చదివిందట. క్రమం తప్పక దిన పత్రికలు చదువుతుందట. వీక్లీలు చదువుతుంది. పత్రికలకు ఉత్తరాలు రాయడం ఆమె హాబీల్లో ఒకటి, సినిమాలన్నా, నాటకాలన్నా ఇష్టం, అంది.



పాటకు ఎదురుగా ఏ - 1 మటన్‌షాప్


ఈ మధ్యే కాలనీలో చౌరస్తాను కలిపే నాలుగువైపులా మంచి రోడ్డు వేశారు. తనకు నడవడం సమస్య. అందుకే ఈ రోడ్డు ఆలీబాబా అద్భుత దీపంలా - తనకొక వరంలాగా మారిందని ఆనందంగా చెప్పిందావిడ

ఎన్టీఆర్ తన అభిమాన నటుడట. ఒకసారి చంద్రబాబుగారు ఇటువైపు వస్తే, బాబూ అని పిలిచి షేక్‌హ్యాండిచ్చిందట. రాజకీయాలపై ఉన్న ఆసక్తితోకాదు, ఎన్టీఆర్ అల్లుడు కదా అన్న అభిమానంతో అట.



చౌరస్తాలో లోక పావని

చాలా పాటలు వచ్చని చెప్పింది. శివుడు, దుర్గామాతా సాయిబాబా పాటలు... శబరిమలై పాటలు, ఎన్నో పద్యాలు కీర్తనలు పాడుతానంది. ప్రభువు పాటలు కూడా చాలా వచ్చు, పాస్టర్‌లు కూడా నన్ను మెచ్చుకుంటారు, గర్వంగా చెప్పిందావిడ.

వీధిలో పాడతారు. పాడటానికి బెరుగ్గా ఉండదా, ఇబ్బంది ఫీల్ కారా? అంటే లేదంది. ఉత్సాహంగా ఉంటుంది. పాడటం నాకిష్టం కదా... అని హాయిగా నవ్వింది.

ముఖ్యంగా ఒకటి చెప్పాలి. ఆమె అద్భుతంగా పాడుతుందనుకుంటే పొరబాటు. శాస్త్రీయ సంగీతం వచ్చనుకున్నా అంతే. ఆమె లలిత సంగీతం కూడా నేర్చుకోలేదు, ఎంఎస్ సుబ్బలక్ష్మి కాదు.. పి.సుశీల తన అభిమాన గాయని అంది. అదీ ఆమె అభిరుచి.

అయినా ఆమె పాడుతుంది. అద్భుతంగా అనలేం కానీ శ్రావ్యంగా పాడుతుంది. ఐడెంటిటీ క్రైసిస్ కోసం కాదు, పాడటం ఒక అవసరంగా పాడుతుంది.

మరి ఏకాంతంగా పాడుకోవచ్చుకదా, వీధిలో ఎందుకూ? అంటే, నిజమే. కానీ దానివల్ల సంఘానికి ఏం లాభం? అని తిరిగి ప్రశ్నించింది.

సంఘానికి?

అదేమిటి?

ఇంతకీ ఆమె ఎందుకు పాడుతుందో చెబితేగానీ అది అర్థంకాదు. అదే అడిగితే, కలికాలంలో యజ్ఞయాగాది కర్మలకన్నా పాటే మనుషులను పవిత్రులను చేస్తుంది. పాటే, దైవ నామమే మంత్రం అంది. నామమే మనుషులను పైకి తెస్తుంది. అందుకే నా వంతుగా నేను రాగాలు రాకపోయినా పాడుతున్నాను, ఇబ్బందేమీ లేకుండా, ఆత్మ విశ్వాసంతో చెప్పింది.

ఆశ్చర్యపోవడాన్ని గమనించి ఇలా వివరించింది: ' అవును నాయనా, ఇది కలియుగం కదా. యజ్ఞయాగాలకు ఇది కాలం కాదు. వాటిని నిర్వహించే తీరుబాటు, ఓపికా ఎవరికీ లేదు. అందుకే మనుషులను పవిత్రులను చేయడానికి, వారికి నామం వినిపించడాన్ని మించింది నాకు మరోటి తోచలేదు. అందుకే ఇలా పాడుతున్నాను - నా వంతుగా నేను మానవత్వాన్ని తట్టిలేపేందుకు గొంతుక నిస్తున్నాను. నా పాటకు ఇంతకు మించిన కారణం లేదు, ' అన్నట్టు వివరించిందావిడ.

పాడటం వల్ల నాకు మనఃశ్శాంతి లభిస్తుంది. ఇంకేం కావాలి? అని కూడా అంది.

ఇంతకుమించి మరేమీ లేదు.

'ప్రస్తుతం నా ఖర్చులకు రెండొందలు వితంతు పెన్షన్ వస్తుంది. రాజీవ్ గృహకల్ప కింద ఇంటికోసం ఎదురుచూస్తున్నాను. అది రాగానే ఒక పాక వేసుకుని పాడుకుంటూ ఉంటాను. నాకూ మంచిరోజులు వస్తాయి, ' నమ్మకంగా చెప్పిందావిడ.

ఇదీ ఆమె కథ.

ఎంతో మంది ఉంటారు. తమకు అబ్బిన విద్యను సామాజికం చేయడానికి ఎంతో ఇదవుతారు. కానీ ఈమెను చూడండి.

నేనేమీ ఎం.ఎస్.సుబ్బలక్ష్మిని కాదంటూనే, వినేవారుంటే ఎంత సేపైనా పాడతాను, అంది. వీధిలో సౌకర్యంగానే ఉంది, అంది. వర్షాకాలమే కష్టం అని చెప్పింది.

చివరగా గంభీరమైన ఓ ప్రశ్న - మిమ్మల్ని మీరు కళాకారిణి అనుకుంటున్నారా?



కూతురు నాగ విజయ లక్ష్మి, కొడుకు నాగ హనుమ సాయికృష్ణతో లీలావతి

దానికి ఆమె - అయ్యో, అదేం లేదండీ, అంది.

గొంతు ఉంది కదా. నామంతో దాన్ని పావనం చేసుకుంటున్నాను, అంతే, అంది వినంరంగా.

మరి టేప్ రికార్డర్‌లో రికార్డు చేసుకుని మీ పాటల్ని మీరే ఎందుకు వింటారు? ఇంకా బాగా పాడేందుకు ప్రాక్టీస్ చేసుకోవడం ఎందుకూ అంటే, అభివృద్ధి ఉండాలి కదా, అంది. అభివృద్ధి ఉంటే ఇంకొందరు వింటారు కదా, అని కూడా అంది.

పోనీ, సంగీతం నేర్పితే నేర్చుకుంటారా?

ఆమె కళ్ళు మెరిశాయి.

అవకాశం ఉంటే తప్పక నేర్చుకుంటాను, అంది.

ఇంకా ఇలా చాలా సంభాషణ జరిగింది. కాగితం మీద రాస్తే ఆవిడ జవాబిస్తూ పోయింది. ఇంతలో ఆమె కొడుకు లేచాడు. లోపల్నుంచి కూతురూ వచ్చింది. కోడలు, మనవరాలు కనిపించారు. ఇంట్లో చాలా మందే ఉన్నారు. కానీ వారికి, మీకూ, నాకూ అందరికీ వినిపించేలా ఆమె ఒకటే సంగతి చెప్పింది, మంచి రోజులు వస్తాయని.

ఒక పక్షం రోజుల క్రితం ఆమెను చూడ్డానికి వెళ్ళడంతో ఆమె ఎంతగా సంతోషించిందంటే, చౌరస్తాలో తాను లేకుంటే తన గురించి అడుక్కుంటూ ఒకరు రావడం ఆమె జీవితంలో మొదటిసారట. అందుకు ఆమె ఎంతగా ఆనందపడిందో!



దయచేసి, మీకో రిక్వెస్టు. మీ కళ్ళముందు కనిపించే ఇలాంటి మామూలు మనుషుల గురించి ఎవరికైనా చెప్పండి. వాళ్ళని వింత చేష్టలని అనుకున్నా సరే, వాటి గురించి ఏదో రూపంలో చెప్పండి. నచ్చిన వారెవరో వెతుక్కుంటూ వెళతారు. అది ఎందుకైనా కానీయండి - ఆనందించే మనిషిని చూడటం, మంచి రోజుల గురించి వారు చెప్పగా వినడం ఎంత బావుంటుంది!

"మంచి రోజులొస్తాయి. ఒక పాక వేసుకుని పాడుకుంటూ వృద్ధాప్యాన్ని గడుపుతాను" హుషారుగా అంటోందావిడ.

తన మాటల్ని బట్టి ఆమెకు వృద్ధాప్యం మీద పడ్డట్టు అనిపించలేదు. అది ఇంకెప్పుడో వస్తుందనుకుంటోంది.

చివరగా, వచ్చేముంది అంది, తోడువస్తే జోధా అక్బర్ సినిమా చూస్తాను అని.

అదీ ఆవిడ హుషారు.

ఒకసారి వెళ్ళి తీసుకెళ్ళాలి.

*ఉపసంహారం*

తన స్నేహితుడినెవరినో డ్రాప్ చేసి వస్తుంటే లీలావతిగారిని చూసి, ఆమె గురించి రాయమని చెప్పిన న్యూనల్లకుంట జిరాక్స్ సెంటర్ మిత్రుడు శ్రీశైలంకు కృతజ్ఞతలు.

చిరునామా:
ఉమ్మెత్తుల లీలావతి,
ఎల్.ఐ.జి - 70/1. కె.పి.హెచ్.బి కాలనీ,
ఫోర్త్‌ఫేజ్,
హైదరాబాద్ - 72, ఆంధ్రప్రదేశ్, భారత్,
ఇంటి నంబరు: 64626876
అబ్బాయి మొబైల్: 9989253987

కందుకూరి రమేష్ బాబు
kandukurirameshbabu@yahoo.co.in